

మంత్రిని కలిసిన పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ శర్మ

పథకాల అమలులో తెలంగాణ ఆదర్శం

» మంత్రి శ్రీధర్‌బాబు

మంచాల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఐటీశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబును శుక్రవారం పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్న కుమార్ శర్మ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తనకు పార్టీలో రాష్ట్ర బాధ్యతలు అప్పగించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువచేయాలని సూచించారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మంచాల మండల మాజీ అధ్యక్షుడు ముచ్చర్ల వెంకటేష్‌యాదవ్, చిత్తాపూర్ మాజీ సర్పంచ్ జిలమోని సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

» దుక్కి దున్ని.. విత్తు నాటి



ఈ ఏడాది ముందస్తు మురిపించిన వరుణుడు ఆ తర్వాత ముఖం చాటేశాడు. ఇరవై రోజులుగా జాడ లేకుండా పోవడంతో రైతులు ఆందోళన చెందారు. గత రెండు రోజులుగా జిల్లావ్యాప్తంగా మళ్లీ వర్షాలు కురుస్తుం డటంతో రైతన్నలు పొలం బాట పట్టారు. భూమి పదునెక్కడంతో దుక్కులు దున్ని విత్తు నాటే పనుల్లో నిమగ్నమయ్యారు. ముందస్తుగా విత్తనాలు వేసినవారు కలుపు తీసే పనులు చేస్తున్నారు. శంకర్‌పల్లి, ఉమ్మడి కొందుర్గు మండలాల్లో జోరుగా వ్యవసాయ పనులు జరుగుతున్నాయి.

- చౌదరిగూడ/ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా



నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలి

» హౌసింగ్ బోర్డు రాష్ట్ర కార్యదర్శి గౌతమ్



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వీపీ గౌతమ్

మహేశ్వరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్‌బోర్డు రాష్ట్ర కార్యదర్శి వీపీ. గౌతమ్ అన్నారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాలలో నిర్మాణ దశలో ఉన్న ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల కేటాయింపుల్లో అవకతవకలు జరగకుండా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వాణి, హౌసింగ్‌బోర్డు డీఈ బిక్కునాయక్, ఏఈ వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.



డ్రా తీస్తున్న డీఆర్వో సంగీత

2-బీ బార్ కోసం డ్రా

రంగారెడ్డి అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 2-బీ బార్ కోసం మే 14వ తేదీన నోటిఫికేషన్ జారీ చేశారు. అదే నెల 15, 16తేదీల్లో దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 57 మంది 2-బీ బార్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కొంగర కలాన్‌లోని జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం డీఆర్వో సంగీత చేతుల మీదుగా డ్రా తీశారు. సరూర్ నగర్ శ్రీనివాసపురం కాలనీకి చెందిన అంతటి వికాస్‌గౌడ్ 2-బీ బార్‌ను కైవసం చేసుకున్నాడు. ఆయనకు లైసెన్స్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. రైతులకు నిరంతర ఆదాయం అందించే ఈ పంట సాగు విస్తీర్ణం పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఈ ఏడాది జిల్లాలో 3,750 ఎకరాల్లో సాగు లక్ష్యంగా నిర్దేశించింది. టార్గెట్‌ను రీచ్ అయ్యేందుకు ప్రత్యేకాధికారులను నియమించింది. వీరంతా పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు పంట వేసే వరకు బాధ్యత తీసుకుంటారు. అంతేకాకుండా రైతులకు అనేక రకాలుగా ప్రోత్సాహకాలు ప్రభుత్వం అందిస్తుంది. రాయితీపై మొక్కలు, డ్రిప్ పరికరాలు అందజేస్తోంది. అలాగే తోటలో అంతర పంటల సాగుకు నాలుగేళ్ల పాటు సాయం చేయాని నిర్ణయించింది.



3,750 ఎకరాలు

ఈ ఏడాది జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం

- విస్తీర్ణం పెంపుపై సర్కార్ ఫోకస్
- సబ్సిడీపై మొక్కలు, పరికరాలు
- నాలుగేళ్ల పాటు అంతర పంటల సాగుకు 'సాయం'
- ఏడాదికి ఒక్కో ఎకరానికి రూ. 4200 అందజేత
- పకడ్బందీగా అమలుకు ప్రత్యేకాధికారుల నియామకం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

రాష్ట్రంలో ఆయిల్ పామ్ తోటల సాగు పెంపుకు కసరత్తు చేస్తున్న ప్రభుత్వం ఈ ఏడాది జిల్లాపై కూడా ఫోకస్ పెంచింది. ఈ ఏడాది కనీసం 3750 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలను రైతులతో సాగు చేయించేందుకు లక్ష్యాలను నిర్దేశించింది. ఈ మేరకు క్షేత్రస్థాయిలో తగిన ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారులకు ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాలతో ఉద్యానశాఖ జిల్లా అధికారి సురేష్ ఆయిల్ పామ్ సాగు, లబ్ధిదారుల ఎంపిక కోసం నలుగురు ప్రత్యేకాధికారులను నియమించారు. ఆ పంట సాగుపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అధికారులు సదస్సులు నిర్వహించారు. ఈ పంట భవిష్యత్తులో లాభదాయకంగా ఉంటుందని రైతులకు అధికారులు వివరించి వారికి అవగాహన కల్పిస్తున్నారు. దీంతో ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం జిల్లాలో 2100 ఎకరాల్లో మాత్రమే రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. ఇందులో 642 ఎకరాలు గతేడాది కాలంగా సాగులోకి తెచ్చారు. రానున్న పదేళ్లలో ఆయిల్ పామ్‌కు ఉన్న డిమాండ్‌ను



మిగతా 6వ పేజీలో...

నలుగురు ప్రత్యేకాధికారులు

ఇదిలా ఉంటే ఆయిల్ పామ్ సాగును ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు లేకుండా చూసేందుకు నలుగురు ప్రత్యేకాధికారులను నియమించింది. ప్రాంతాల వారీగా వీరికి బాధ్యతలు అప్పగించారు. సంబంధిత మండలాలకు చెందిన రైతులు ఈ కింద సూచించిన అధికారులను సంప్రదిస్తే ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించడంతో పాటు పంట వేసే వరకు బాధ్యత తీసుకుంటారు. ఇబ్రహీంపట్నం, యాచారం, బాలాపూర్, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, మాడ్గుల, మంచాలకు చెందిన రైతులు వ్యవసాయాధికారి నవీన(8977714219)ను సంప్రదించాలి. అలాగే చేవెళ్ల, మొయినాబాద్, శంకరపల్లి, షాబాద్, శేరిలింగంపల్లి, గండిపేట రైతులు వ్యవసాయాధికారి కీర్తి కృష్ణ (8977714222), ఆమనగల్, కడ్తాల్, మహేశ్వరం, కందుకూరు, శంషాబాద్, రాజేంద్రనగర్ రైతులు ఉద్యాన అధికారి సౌమ్య (8977714221), షాద్‌నగర్, కేశంపేట, కొత్తూరు, నందిగామ, చౌదరిగూడెం, కొందుర్గు, తలకొండపల్లి మండల రైతులు ఉద్యాన అధికారి హిమబిందు (8977714220)ను సంప్రదించాలి.

సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్, జూన్13(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నీతా పోలే తెలిపారు. దోస్త్ ఐడీతో కళాశాలలో సంప్రదించి ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. విద్యార్థులు మీసేవా, ఇతర ఆన్‌లైన్ సెంటర్లలో అనవసరంగా ఫీజులు చెల్లించవద్దని సూచించారు. నేరుగా తమ కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కళాశాలలో బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ, బీఏ, బీకాం, ఎంపీసీ, ఎంపీసీఎస్, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు ఉన్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 6305051490 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అధ్యాపకుల నియామకానికి...

కడ్తాల్ : కడ్తాల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు తాత్కాలిక మహిళా అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారి అనిత తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు, ఆంగ్లం, గణితం, సైన్స్ బోధించేందుకు అధ్యాపకులను నియమిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తి ఉన్న పీజీ, బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 18వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మోదీ పాలనలో అద్భుత పథకాలు

బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ బోసుపల్లి ప్రతాప్




మహేశ్వరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : మునుపెన్నడూ లేనివిధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ 11ఏళ్ల పాలనను దిగ్విజయంగా పూర్తి చేసిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ బోసుపల్లి ప్రతాప్ అన్నారు. శుక్రవారం నాగారంలో కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రధాని చేసిన కృషిని ప్రపంచదేశాలు అభినందిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు టి. యాదీష్, నర్సింహారెడ్డి, మిద్దె సుదర్శన్‌రెడ్డి, పాపయ్యగౌడ్, జంగయ్యయాదవ్, అనంతయ్యగౌడ్, యాదయ్యగౌడ్, మాధవాచారి, వెంకటేషగౌడ్, సుదర్శన్‌యాదవ్, కుమార్, మహేందర్, వెంకటేష్, దేశ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మినీ స్టేడియం కల నెరవేరేనా?

మేడిపల్లిలో ఏర్పాటుకు క్రీడాకారుల డిమాండ్

- ఫార్మాసిటీ భూమిలో కొంత కేటాయించాలని విన్నపం
- ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని వేడుకోలు



మేడిపల్లిలో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూమిలో ఆటలాడుతున్న క్రీడాకారులు

యాచారం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): యాచారం మండలంలో మినీ స్టేడియం లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న ఆటగాళ్లు ఉన్నప్పటికీ మైదానాలు లేక అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా నిరుద్యోగ యువత కానిస్టేబుల్, ఎస్ఐ, మిలిటరీ తదితర ఉద్యోగాలకు సమాయత్తం కావడానికి స్టేడియం అందుబాటులో లేక వ్యవసాయ పొలాలు, వెంచర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, మల్కీజ్‌గూడ, కుర్మిద్ద, యాచారం, తక్కళ్లపల్లి, కొత్తపల్లి, నందివనపర్తి, చింతపట్ల తదితర గ్రామాల క్రీడాకారులు స్థానికంగా మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని

మిగతా 6వ పేజీలో...

వసతులు మేం ఏర్పాటు చేసుకుంటాం

మండలంలో మినీ స్టేడియం ఏర్పాటు చేస్తే వసతులను సమకూర్చుకుంటామని క్రీడాకారులు చెబుతున్నారు. మినీ స్టేడియం నిర్మాణం చేపడితే మండల, జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించవచ్చని అంటున్నారు. కాగా, మేడిపల్లిలోని ఈ స్థలం చుట్టూ టీజీఐఐసీ అధికారులు ఫెన్సింగ్ వేయకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాలి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలు కల్పించుకొని మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడి మినీ స్టేడియం ఏర్పాటు చేయించాలని క్రీడాకారులు కోరుతున్నారు. ఇంతకు ముందు మేడిపల్లి గ్రామంలో వేరేచోట ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం రద్దు చేసి, మినీ స్టేడియం ఏర్పాటుకు ప్రభుత్వ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

స్టేడియం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి



మా గ్రామంలో 285 సర్వే నెంబర్‌లో నాలుగు ఎకరాల భూమిని మినీ స్టేడియం ఏర్పాటుకు కేటాయించాలి. మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులు ఫార్మాసిటీ కోసం వేలాది ఎకరాల పట్టా, అసైన్డ్ భూములను ఇచ్చాం కదా. క్రీడాకారుల అవసరాలను గుర్తించి ఇదే స్థలంలో మినీ స్టేడియం ఏర్పాటుకు చొరవ చూపాలి. స్థలం ఇస్తే అన్ని వసతులను మేమే కల్పించుకుంటాం.

- బాలరాజ్, క్రికెటర్, మేడిపల్లి

పుస్తక పఠనంతో విజ్ఞానం

» ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



గ్రంథాలయానికి పుస్తకాలను అందిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్ అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ గ్రేడ్-1 గ్రంథాలయానికి రూ.25 వేల పుస్తకాలను అందజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కొప్పుల మదన్‌మోహన్‌రెడ్డికి పుస్తకాలను అందించారు. అనంతరం మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్లు వచ్చిన తరువాత విద్యార్థులకు పుస్తక పఠనం తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి పుస్తకాలు చదివితే విజ్ఞానం పెరగడం తోపాటు ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. విద్యార్థులు గ్రంథాలయంలోని పుస్తకాలను ఉపయోగించుకొని పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలన్నీ గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. చాలామంది ఇళ్లలో వృథాగా ఉన్న మంచి పుస్తకాలను గ్రంథాలయానికి ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు క్యాసెట్ శ్రీనివాస్, నక్క బాల్‌రాజ్, వీరేశం, రవిగౌడ్, కత్తి చంద్రశేఖరప్ప, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



అసౌకర్యాల రైతు వేదికలు

- తాగునీటి సదుపాయం కరువు
- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- పరిశుభ్రతా అంతంతే..

4

చెరువు కాదు.. రోడ్డే



ఈ ఫొటోను చూస్తే ఇక్కడ ఉన్నది చెరువు అనుకుంటారు. కానీ, ఇది చౌదరిగూడ మండల పరిధిలోని లాల్‌పహాడ్ నుంచి వికారాబాద్ జిల్లా కంకల్ వరకు ఉన్న రోడ్డు. దీనిని రూ.14.76కోట్లతో డబుల్ రోడ్డుగా నిర్మాణం చేపట్టారు. ఇది పూర్తయితే వాహనదారుల కష్టాలు తీరుతాయనుకుంటే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా అవి రెట్టింపయ్యాయి. రోడ్డుపై కంకరపోసి వదిలేయడంతో నరకం చూస్తున్నారు. అంతేకాకుండా ఇటీవల కురిసిన వర్షానికి నీరు నిలిచి చెరువును తలపిస్తోంది.

చౌదరిగూడ, జూన్ 13(ఆంధ్రజ్యోతి)

ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలి

ఆదిభట్ల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తే సంస్థ మునుగడ అభివృద్ధి పథంలో ప్రయాణిస్తుందని సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ఛైర్మన్ రాఘవ చెరబుడ్డి అన్నారు. శుక్రవారం సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో 21వ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కాలేజీలో 10, 15, 20 సంవత్సరాలు పూర్తిచేసుకున్న ఉద్యోగులకు ఈ సందర్భంగా బంగారు పతకాలు, మెమొంటోలు అందజేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, డీన్(అకడమిక్) నయనతార, లాల్‌కిషోర్, శేషగిరిరావు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అసౌకర్యాల రైతు వేదికలు

- తాగునీటి సదుపాయం కరువు
- మరుగుదొడ్లు ఉన్నా నిరుపయోగం..
- పరిశుభ్రతా అంతంతే..

చేవెళ్ల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రైతు వేదికలు అసౌకర్యాల నడుమ కొనసాగుతున్నాయి. వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు, మెలకువలపై రైతులతో చర్చించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ క్లస్టర్‌కు ఓ రైతువేదిక నిర్మించింది. ఐదు వేల ఎకరాలకు ఓ క్లస్టర్ ఏర్పాటు చేసి ఏఈవోలను నియమించింది. చేవెళ్ల డివిజన్‌లో మొత్తం 17 రైతువేదికలను నిర్మించి ప్రతీ దానికి రూ.22 లక్షల చొప్పున ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇందులో చేవెళ్ల మండలంలో ఐదు, శంకర్‌పల్లి మండలంలో నాలుగు, షాబాద్ మండలంలో ఆరు, మొయినాబాద్ మండలంలో రెండు చొప్పున పంచాయతీ రాజ్, ఎన్ఆర్ఈజీఎస్‌ల భాగస్వామ్యంలో నిర్మించారు. చేవెళ్ల డివిజన్‌లో నిర్మించిన సంగం రైతు వేదికల్లో నీటి సౌకర్యం లేదు. వేదికల వద్ద మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించినప్పటి నీటి సౌకర్యం కల్పించలేదు. పలు క్లస్టర్లల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ నుంచి కనెక్షన్లు ఇచ్చారు. నల్లాల ద్వారా నీటిని నిలువ చేసుకోవడానికి ఎలాంటి పంప్‌హౌస్‌లు నిర్మించకపోవడంతో నీరు వృథా పోతోంది. రైతులకు కొత్త వంగడాల వివరాలు, తెగుళ్ల సోకినా, భూసార పరీక్షలు తదితర విషయాలపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలనే ఉద్దేశంతో రైతు వేదికలు ఏర్పాటు చేసినా లక్ష్యం నెరవేరడం లేదనే అభిప్రాయం రైతుల నుంచి వ్యక్తమవుతోంది. కొన్నిచోట్ల రైతు వేదికలు ఎప్పుడు చూసినా తాళం వేసి ఉంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతువేదికలు శుభ్రంగా ఉంచే సిబ్బంది లేకపోవడంతో దుమ్ము, ధూళితో నిండిపోతున్నాయి.



గ్రామాలకు దూరంగా రైతు వేదికలు

సభలు, సమావేశాలకు వస్తున్న అధికారులకు, రైతులకు తాగునీటి వసతి లేకపోవడంతో పాటు రైతు వేదికలు గ్రామాలకు దూరంగా నిర్మించడంతో మహిళా రైతులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. కాగా, నల్లా కనెక్షన్లు ఇవ్వని వాటిలో చాలావరకు గ్రామాలకు దూరంగా నిర్మించారు. కొన్నింటికి ఎలాంటి నీటి సౌకర్యం కల్పించలేదు. ఉన్నతాధికారులు సౌకార్యలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

నీటి సౌకర్యం కల్పించాలి



రైతు వేదికలకు వెళ్లి పంట సాగు విషయాలు మాట్లాడుకుందామంటే అసౌకర్యంగా ఉంటోంది. లోపల శుభ్రంగా ఉండటం లేదు. నీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి. ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలి.

- ఎన్.గోపాల్‌రెడ్డి, రైతు, మల్కాపూర్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



రైతు వేదికల నిర్వహణకు నిధులు నిలిచిపోయాయి.తాగునీటి సౌకర్యం కల్పించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సిబ్బంది సైతం లేకపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేశాం. త్వరలో సమస్యలు పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటాం.

- శంకర్‌లాల్, ఏఈవో, చేవెళ్ల మండలం

బీజేపీ బలోపేతంపై దృష్టి సారించాలి

యాచారం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త శ్రమించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం యాచారం మండల బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అరచేతిలో వైకుంఠం చూపుతూ జనాలను మోసం చేస్తుందన్నారు. దివ్యాంగుల పింఛన్లను రూ.6వేలకు, వృద్ధులు, వితంతువుల పింఛన్లను రూ.4వేలకు పెంచుతామని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలుపుకోలేకపోతున్నారని మండిపడ్డారు. పంచాయతీలకు ఎన్నికలు జరిపి గ్రామాలను అభివృద్ధి చేయాలనే చిత్త శుద్ధి పాలకులకు లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నిప్పులు చెరిగారు. ఫ్యూచర్‌సిటీ పేరుతో మున్సిపాల్టీ ఏర్పాటు చేస్తారా అనే అనుమానం కలుగుతుందన్నారు. అంతకుముందు విమాన ప్రమాదంలో మరణించిన మాజీ సీఎం విజయ్‌రూపాణి మృతికి సంతాప సూచకంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళ్లర్పించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కొప్పు బాషా, విజయ్‌నాయక్, తాండ్ర రవీందర్, డేరంగుల రాజు, శేఖర్, జి.రమేష్‌జీ, పి.శ్రీశైలం. మేకల యాదగిరిరెడ్డి తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అంజన్‌కుమార్ గౌడ్

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి/పూడూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం పరిగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొదటి విడత, రెండో విడత కలిపి మొత్తం ఏడు వేల ఇళ్లు వచ్చాయన్నారు. ఇళ్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందొద్దని, దశలవారీగా ప్రతి ఒక్కరికీ ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిగి ఏఎంసీ ఛైర్మన్ బి.పరశురాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, పట్టణ అధ్యక్షుడు ఈ.కృష్ణ, మాజీ వైఎస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, నాయకులు తావుర్యానాయక్, వెంకట్రాములు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసెలు లేని రాష్ట్రమే లక్ష్యం

గుడిసెలు లేని రాష్ట్రం కావాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పూడూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూడూరు మండలంలోని అన్ని గ్రామాలకు కలిపి మొత్తం 306 ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందించినట్లు తెలిపారు. ఘట్టేపల్లి గ్రామ సమీపంలో సబ్ స్టేషన్ నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేందర్, పీఏసీఎస్ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, షకీల్, పెంటయ్య, శ్రీనివాస్, నారాయణ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న రామ్మోహన్‌రెడ్డి



వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్

వేంకటేశ్వరుడి సేవలో ఎమ్మెల్యే

శంషాబాద్ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, నార్సింగ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనేగౌని శ్రీకాంత్‌గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. జన్మదినం సందర్భంగా డైరెక్టర్ శ్రీకాంత్‌గౌడ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామి ఆశీస్సులతో జీవితంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేతో కలిసి వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, బోజిరెడ్డి, అనేగౌని శ్రీధర్‌గౌడ్, చంద్రన్‌గుట్ట శ్రీనివాస్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించుకోవాలి

- చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం

మొయినాబాద్ రూరల్; జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ మొక్కలునాటి వాటిని సంరక్షించుకోవాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం తెలిపారు. శుక్రవారం మొయినాబాద్ మండల పరిధిలోని తోల్‌కట్ట గ్రామంలో తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా కెఎస్. రత్నం ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కన్నతల్లి, ఆత్మీయుల పేరు మీద మొక్కలు నాటి వాటిని సంరక్షించుకునే కార్యక్రమం మొయినాబాద్ మండలంలో ప్రారంభించడం జరిగిందన్నారు. పచ్చదనం పరిశుభ్రతచాలా అవసరం అన్నారు. కార్యక్రమంలో కంజర్ల ప్రకాశ్, గోపాల్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వీరేష్, కిషన్, మాధవరెడ్డి, రాజు, జగపతి, గణేష్ , శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



తోల్‌కట్టలో మొక్కలు నాటుతున్న నాయకులు

కొత్త చట్టాలపై అవగాహన తప్పనిసరి

-ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్/కులకచర్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పోలీస్ అధికారి కొత్త చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో అధికారుల కోసం ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేసిన ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కొత్త చట్టాల ఉద్దేశం శిక్షించడం మాత్రమే కాదని, బాధితులకు సత్వర న్యాయం అందించడమేనని ఆయన స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేర విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ శ్రీనివాసులు, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఎస్ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కులకచర్ల పీఎస్ సందర్శన

అలాగే ఎస్పీ నారాయణరెడ్డి కులకచర్ల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. నేరాలఅదుపులో సిబ్బంది ముందుండాలని సూచించారు. గ్రామాల్లో నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతీగ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. గంజాయి, రేషన్‌బియ్యం, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. ఈ సందర్భంగా పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సైరమేశ్, పోలీసుసిబ్బంది ఉన్నారు.



కులకచర్ల పీఎస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

ఆమె దారెటు?

చర్చనీయాంశంగా మున్సిపల్ మాజీ ఛైర్ పర్సన్ స్వప్న వ్యవహారం

తాండూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ స్వప్న చేసిన ప్రసంగం చర్చకు దారి తీసింది. శుక్రవారం తాండూరు పట్టణంలో ప్రధాని మోదీ ప్రభుత్వం 11సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రొఫెషనల్ మీట్ కార్యక్రమంలో పాల్గొని ప్రధానిని పొగడుతూ మాట్లాడారు. ఈ ప్రసంగం తాండూరు పట్టణంలో అటు అధికార కాంగ్రెస్ పార్టీలో, ఇటు బీజేపీలో చర్చనీయమైంది. ప్రధానిగా మోదీ లేకుంటే రామ మందిరం నిర్మాణం జరిగి ఉండేది కాదేమోన్నారు. మోదీ పాలన నాభూతో నా భవిష్యత్తు అన్న విధంగా పార్టీలకతీతంగా పాలన చేస్తున్నారని పొగడ్తలతో ముంచెత్తారు. ప్రస్తుతం స్వప్న అధికార కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. కాంగ్రెస్‌లో ఎవరికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు అన్న విషయంపై చర్చ నడుస్తోంది. మరోవైపు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కార్యక్రమాలు తాండూరు పట్టణంలో కొనసాగుతుండగా అందులో పాల్గొనకుండా ప్రొఫెషనల్ కార్యక్రమంలో పాల్గొనడం రెండు పార్టీల్లో చర్చనీయాంశమైంది. ప్రసుత్తం మాజీ ఛైర్‌పర్సన్ వ్యవహారం ఎవరికీ అంతు చిక్కడం లేదు.



మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ స్వప్న



జెండాను ఆవిష్కరిస్తున్న నాగరాజు, మహేశ్

మోదీ పాలనలో అద్భుత విజయాలు

కడ్తాల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలనా దక్షతతో 11ఏళ్లలో దేశం అద్భుత విజయాలు సాధించిదని, దేశాభ్యున్నతికి మోదీ సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు దోనాదుల మహేశ్ ఆధ్వర్యంలో మైసిగండి గ్రామంలో శుక్రవారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంటేకార్ భగీరథ్, సాయిలాల్ నాయక్, లక్ష్మణ్‌నాయక్, శ్రీశైలం గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బాలకృష్ణ గౌడ్, రెడ్యనాయక్, శంకర్‌నాయక్, రవీందర్ రెడ్డి, వెంకటేశ్,సంతోష్, వెంకటేశ్ యాదవ్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



గురునాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న మైనారిటీ నాయకులు

ఘనంగా గురునాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలు

కొడంగల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కొడంగల్‌లో మైనారిటీ నాయకులు ఎస్‌ఎం.గౌసన్ ఆధ్వర్యంలో గురునాథ్‌రెడ్డిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకుంటూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అహ్మద్‌ఖాన్, నూర్‌ఖాన్, సయ్యద్ వాహెద్, రహమత్‌ఖాన్, మొహ్మద్ రహీం, సయ్యద్ ఖాలీద్, ఇంతియాజ్, డాక్టర్ నజీరుద్దీన్ తాహెర్, మొహ్మద్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నగుడి నిర్మాణానికి విరాళం

చేవెళ్ల, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : పట్టణ కేంద్రంలో నిర్మిస్తున్న మల్లన్నగుడి నిర్మాణం కోసం చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి సమతారెడ్డి దంపతులు, చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారు శైలజాఆగిరెడ్డి దంపతులు రూ.30 లక్షలు విరాళం అందించారు. ఈమేరకు శుక్రవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, చేవెళ్ల గ్రామస్థులు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



చేవెళ్ల మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

చేవెళ్ల, జూన్ 13 (ఆంధ్ర జ్యోతి): ప్రైవేట్ పాఠశాలలో ఎక్కువ ధరకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బ్యాగులను అమ్ముతున్నారని, విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని పీడీఎస్‌యూ చేవెళ్ల డివిజన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం అధిక ధరలకు అమ్ముతూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నారని ఆరోపించారు. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాజేశ్, మండలాధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఇస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

షాద్‌నగర్ అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం పొందిన వారికి సీఎంఆర్‌ఎఫ్ వరంలా మారిందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈమేరకు శుక్రవారం షాద్‌నగర్‌లోని ఆయన కార్యాలయంలో 13 మందికి మంజూరైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మైనిక హరికృష్ణగౌడ్, రామకృష్ణ, తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, బాబురావు, రవీందర్‌రెడ్డి, జేకే నర్సింహులు, ఎజాజ్, దర్గా రామచంద్రయ్య, జనార్ధన్‌గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ మోర్చా నియోజకవర్గ ఇన్‌చార్జిగా మోహన్‌సింగ్ నాయక్



షాద్‌నగర్ అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎస్టీ మోర్చా షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మోహన్‌సింగ్ నాయక్ నియమితులైనారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్ శుక్రవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ప్రధాని నరేంద్రమోదీ అమలు పరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయి, బీజేపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని మోహన్‌సింగ్ తెలిపారు. తనకు బాధ్యతలు అప్పగించేందుకు సహకరించిన కళ్యాణ్‌నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలకు మోహన్‌సింగ్ కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చౌదరిగూడ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని రావిర్యాలలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో రోడ్డు సౌకర్యం బాగుంటేనే రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విడతల వారీగా నిధులు మంజూరు చేస్తూ గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివకుమార్, వెంకటయ్య, మహేష్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

16న రైతు వేదికలను ప్రారంభించనున్న సీఎం

» కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈనెల 16న సీఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్న 35 రైతు వేదికలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రైతు వేదికల ప్రారంభోత్సవం సందర్భంగా రైతులతో సీఎం మాట్లాడే అవకాశం ఉందని, గ్రామాల నుంచి వచ్చే వారికి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్

ఆమనగల్లు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధి వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం వైద్యశాఖ, మున్సిపల్ సిబ్బందితో కలిసి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రచ్చకట్ట వద్ద డాక్టర్ మంజులాదేవితో కలిసి ర్యాలీని కమిషనర్ శంకర్ నాయక్ ప్రారంభించారు. ప్రధాన కూడళ్లలో సీజనల్ వ్యాధులపై వైద్యులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా కేజీబీవీ పాఠశాల వద్ద ఎస్‌వో పద్మజ్యోతి, ఉపాధ్యాయినీలు, విద్యార్థినీలతో కలిసి మొక్కలు నాటారు. మొక్కల ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని శంకర్ నాయక్ కోరారు. పాఠశాలల్లో పరిసరాలను మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. ఆయా కార్యక్రమాలలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల ఎంపికే కీలకం

» కంపెనీల ప్రకటనలతో మోసపోవద్దు
» గుర్తింపు పొందిన సీడ్స్‌తో మేలు
» నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

చేవెళ్ల,జూన్13 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది రుతుపవనాలు వారం ముందుగానే వస్తుండటంతో వానాకాలం సీజన్ ప్రారంభమైంది. రైతులు విత్తనాలు, ఎరువులు, సమకూర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సమయంలో వివిధ కంపెనీలు విత్తనాలు, పురుగుల మందులు విక్రయించేందుకు జోరుగా ప్రచారం చేస్తున్నాయి. ఇలాంటి సమయంలో రైతులు మోసపోకుండా నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కంపెనీలు.. ఆకర్షణీమైన ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలతో రైతులను తమ వైపు తిప్పుకొనే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఒకటి రెండు సార్లు ఆలోచించి నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి. నకిలీ, నాసిరకం విత్తనాలు పెద్దఎత్తున మార్కెట్లో లభ్యమవుతుంటాయి. రైతులు కంపెనీల వలతో పడి విత్తనాలు కొనడం, ఆ తరువాత మోసపోవడం షరా మామూలైంది. చేవెళ్ల డివిజన్‌లో ఆరు



ఫర్టిలైజర్ షాపులో విక్రయానికి ఉంచిన విత్తన ప్యాకెట్లు

తడి పంటల సాగులో పత్తిది మొదటి స్థానం. ముఖ్యంగా పత్తి విత్తనాలకు సంబంధించిన పలు కంపెనీలు గ్రామాల్లో రైతులను ఆకట్టుకునేలా వాహనాల్లో వచ్చి కరపత్రాలు, మైక్‌సెట్ల ద్వారా ప్రచారాలు సాగిస్తున్నారు. తొందరపడి కొనుగోలు తర్వాత నాసిరకం అయితే విత్తనాలు మొలకెత్తకపోవడం, మొలకెత్తినా పంట దిగుబడి తగ్గిపోవడంతో రైతుల శ్రమ వృథా అవుతుంది. ఈక్రమంలో కొందరు రైతులు ఆత్మహత్యకు పాల్పడి ఘటనలూ ఉన్నాయి. నకిలీ విత్తనాలు విక్రయించే కంపెనీలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది నామమాత్రమే. దీనితో నకిలీ విత్తనాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది.

వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలి

రైతులు తప్పనిసరిగా వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి. దళారులను నమ్మి మోసపోవద్దు. ప్రభుత్వ గుర్తింపు ఉన్న దుకాణాల్లోనే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలి. గ్రామాల్లోకి గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి విత్తనాలు అమ్మితే కొనుగోలు చేయవద్దు. అలాంటి వారిపై వ్యవసాయాధికారులకు సమాచారం అందించాలి. మేలురకం విత్తనాలనే ఎంపిక చేసుకొని మంచి దిగుబడి సాధించాలి.

- సురేష్ బాబు, ఏడీఏ, చేవెళ్ల

నేల స్వభావాన్ని బట్టి ఎరువులు

నేల స్వభావాన్ని బట్టి పైరు ఎదుగుదల, చీడ పీడల ఉధృతి ఉంటుంది. కాబట్టి భూమి పోషక విలువలను బట్టి ఎరువులు, పురుగుల మందులు వేయడం ఉత్తమం. ఒకరిని చూసి మరొకరు ఒకే రకం పంటలు, విత్తనాలు వేయడం ఎరువులు, పురుగుల మందులు వేయకుండా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాల మేరకు సాగు చేస్తే మంచిది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడం ఉత్తమం.
- విత్తనాల కొనుగోలు బిల్లుపై నంబరు, విత్తనం రకం, కొనుగోలు తేదీ, డీలర్ల సంతకం, రైతు సంతకం, కొనుగోలు బిల్లుపై ఉండేలా చూసుకోవాలి.
- గడువు దాటిన విత్తనాలు, వదులుగా ఉన్న ప్యాకెట్లు, చిరిగిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాలలో ఉన్నవి అస్సలు కొనుగోలు చేయవద్దు.
- బిల్లులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్ను నంబర్లు, విక్రయదారుడి పేరు, సంతకం, తేదీ, రకం పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీ, నికర ధర, కంపెనీ పేరు తప్పని సరిగా నమోదు చేయాలి.
- విక్రయదారుడు ఇచ్చే కరపత్రాలు తీసుకొనివాటిలో పేర్కొన్న అంశాలను క్షుణ్ణంగా చదవాలి.
- కొనుగోలు చేసిన సరుకును డీలరు వద్ద తూకం వేయించాలి.
- విత్తనాలు మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ అధికారులు లేదా, శాస్త్రవేత్తలను సంప్రదించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకూ జాగ్రత్తగా ఉంచుకోవాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే మొలక శాతాన్ని చూసుకోవాలి. ఆ తరువాత మొలక శాతం సంతృప్తిగా ఉన్న వాటిని విత్తనాలుగా వాడాలి.

క్రిమిసంహారక మందు ఎంపికలో..

- పంట సాగులో చీడ పీడల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఏదో ఒక రకం క్రిమిసంహారక మందు పిచికారీ చేస్తుంటారు. అలా కాకుండా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచన మేరకు మాత్రమే మందులు కొనుగోలు చేసి వాడాలి.
- పురుగుల మందులు రెండు, మూడింటిని కలిపి వాడకూడదు. వాడిన మందుల డబ్బాలను, సీసాలు ధ్వంసం చేసి భూమిలో పాతిపెట్టాలి.
- కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయాధికారుల సహకరంతో ఎరువులను పరీక్షించుకోవాలి.

నిరుద్యోగ యువతకు 'ఉపాధి' శిక్షణ కోర్సులు

శంషాబాద్ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్కిల్ ట్రైనింగ్ సెంటర్ల ద్వారా నిరుపేద, నిరుద్యోగ యువతకు జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ చేయూతనందిస్తుందని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. శంషాబాద్‌లోని ఎయిర్‌పోర్టు క్యాంపస్‌లోని స్కిల్ ట్రైనింగ్ సెంటర్ ప్రస్తుతం పాఠశాల, కళాశాల డ్రాపట్ అయినవారికి 5 విభిన్న కోర్సుల్లో శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా నిరుద్యోగ యువతకు వసతి, భోజనం సదుపాయాలను కల్పించనున్నట్లు తెలిపారు. గెస్ట్ సర్వీస్ అసోసియేట్, ఆటోమొబైల్ రిపేర్, ఎక్సకవేటర్ ఆపరేటర్,డ్రైవాల్స్ అండ్ పాల్స్ సీలింగ్ టెక్నీషియన్, వెల్డింగ్ అండ్ ఫ్యాబ్రికేషన్ టెక్నీషియన్ కోర్సుల్లో 3 నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయా కోర్సుల్లో పరిమిత సీట్లు ఉండటంతో ఆసక్తి గలవారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9912973086, 8985800102 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. దరఖాస్తులకు ఈనెల 20 వరకు గడువు ఉందన్నారు.

పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించాలి

చేవెళ్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన బస్ పాస్ చార్జీలను తక్షణమే తగ్గించాలని ఏబీవీపీ శంషాబాద్ బాగ్ కన్వీనర్ కావలి శివ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బస్‌పాస్ చార్జీల పెంపుతో విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. చాలామంది పేద విద్యార్థులు చదువులకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించాలన్నారు. లేనిచో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

» ఐదుగురి నిందితుల అరెస్ట్



ఘట్‌కేసర్ రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్న ముఠాను ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎక్సైజ్ సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని సఫిల్‌గూడకు చెందిన వేముల జాన్(29), ఈసీఐఎల్‌కు చెందిన మోహన్‌వెంకట్(29), చెంగిచెర్లకు చెందిన మనీస్ ఉపాధ్యాయ్(26), విశాల్(21), మౌలాలికి చెందిన రవితేజ(27) గుట్టుచప్పుడు కాకుండా ఒడిశా రాష్ట్రం, కోరాపూట్ జిల్లా, సుంకీ గ్రామానికి చెందిన జైన్‌మామా నుంచి గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. మౌలాలీ, ఈసీఐఎల్, చెంగిచెర్ల తదితర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు చిన్న చిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారు. వారివద్ద నుంచి 10 కిలోల గంజాయితో పాటు కారు, రెండు బైకులు, 5 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం 5 మంది నిందితులను రిమాండ్‌కు తరలించగా, పరారీలో ఉన్న జైన్‌మామాను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

రేపు చలో ఖమ్మం విజయవంతం చేయండి



పరిగిలో ఖమ్మం సభకు సంబంధించి పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

పరిగి,జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో జూన్ 15న ఆదివారం నిర్వహించ తలపెట్టిన గిరిజన హక్కుల సాధన సభను విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు పి.గట్యానాయక్ కోరారు. ఖమ్మం సభకు సంబంధించి శుక్రవారం పరిగిలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో లంబాడాల సంఖ్యను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల రిజర్వేషన్లను 14 శాతానికి పెంచాలని కోరారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. గిరిజనుల హక్కుల కోసం నిర్వహిస్తున్న ఖమ్మం సభకు జిల్లా నలుమూలల నుంచి గిరిజనులు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గట్యానాయక్, పాండునాయక్, హరినాయక్, రవీందర్‌నాయక్, బాలకృష్ణ, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



వేలంపాట నిర్వహిస్తున్న ఈవో నరేందర్

వీరభద్రేశ్వరుడి భూమి కౌలుకు వేలం

ధారూరు, జూన్13(ఆంధ్రజ్యోతి): ధారూరులోని శ్రీ వీరభద్రేశ్వర ఆలయ భూమి కౌలు కోసం శుక్రవారం ఆలయ ఆవరణలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. సర్వే నంబరు 191లో 0-39 ఎకరాలు, సర్వే నంబర్ 193లో 7-08 ఎకరాలు ఆలయ భూమికి దేవాదాయ శాఖ ఈవో నరేందర్ ఆధ్వర్యంలో కౌలు వేలంపాట పాడారు. వేలంపాటలో మండల పరిధిలోని హరిదాసుపల్లి గ్రామానికి చెందిన జి.రవి రూ.76 వేలు పాట పాడి దక్కించుకున్నారు. కౌలు వేలంపాట దక్కించుకున్న రైతు ఏడాదికి రూ.76వేల చొప్పున మూడు సంవత్సరాల వరకు చెల్లించాల్సి ఉంటుందని ఈవో నరేందర్ పేర్కొన్నారు. అయితే ఆలయ భూమిని సర్వే చేయించాలని స్థానికులు దేవాదాయ శాఖ ఈవోను కోరారు. రికార్డు ప్రకారం 8-07 ఎకరాలు ఉందని, వాస్తవంగా అక్కడ ఆరెకరాల భూమే ఉందని, దాదాపు 2 ఎకరాలు కబ్జాకు గురైందని ఈవోకు తెలిపారు. కార్యక్రమంలో పరిశీలకులుగా ప్రణీత్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అశోక్ ముదిరాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పాటుపడాలి



చెక్కు అందజేస్తున్న గోలి శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళపల్లికి చెందిన కొప్పు మల్లేశ్‌కు మంజూరైన రూ.51వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో లబ్ధిదారుడికి అందజేశారు. ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. నాయకులు గొర్రె పవన్ కుమార్‌రెడ్డి, ఐజాక్, సుభాష్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

బంట్వారం అభివృద్ధికి అఖిలపక్షం



మాట్లాడుతున్న వెంకటేశం

బంట్వారం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బంట్వారం మండల పునర్నిర్మాణంపై అఖిల పక్షం ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని విలేకరులతో మాట్లాడుతూ.. మండలం కేవలం ఏడు గ్రామ పంచాయతీలతో కొనసాగగా మరో నలుగు కొత్త గ్రామ పంచాయతీలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అయితే మండలం చిన్నగా కావడంతో ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఈ మండలానికి పక్క మండలాల్లోని పలు గ్రామాలను చేర్చాలని కోరారు. దీనిపై త్వరలో స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కలిసి వినతి పత్రం ఇస్తామన్నారు. ఈ విషయంపై అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదగిరి, పురుషోత్తం, నర్సింహులు, నర్సింహారెడ్డి, హరిశ్వర్ రెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నర్సింహులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన

» తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు, సాంకేతిక బోధనను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాత తాండూరులోని బాలికల ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియం, మోమిన్‌గల్లిలో నంబర్ -2 పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు హబీబ్ లాల, నాయకులు సంపత్ కుమార్, అబ్దుల్ రవూఫ్, ప్రభాకర్ గౌడ్, రామకృష్ణ పట్లోళ్ల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం

బషీరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొర్విచెడ్‌ఘని సమీపంలోని ఓ ఫంక్షన్ హాలులో ఇందిరమ్మ ఇళ్ల మంజూరీ పత్రాల పంపిణీ కార్యక్రమంలో స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రమేశ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మట్లాడుతూ మండలానికి మొదటి విడతగా 661 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మోహన్‌బాబు, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, మాజీ ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్, మాజీ జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్లు అజయ్ ప్రసాద్, చందర్‌నాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ రామునాయక్, జిల్లా ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ బి.శంకరప్ప, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటేష్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు కలాల్ నర్సింహులు గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తాండూరులో చిన్నారికి అక్షరాలు దిద్దిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

యాలాల: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో 600 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు నాలుగు విడతల్లో బిల్లులు పడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రమేష్ మహరాజ్, సంపత్, యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మినీ స్టేడియం

కల నెరవేరేనా?

(మూడో పేజీ తరువాయి)

ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కాగా, స్టేడియం ఏర్పాటు చేయడానికి అనువైన భూములున్నప్పటికీ పాలకులు మాత్ర పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేడిపల్లిలో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూమిలో..

మేడిపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 285లో ఉన్న పది ఎకరాల పట్టా భూమిని గతంలో ఫార్మాసిటీ కోసం ప్రభుత్వం సేకరించింది. మేడిపల్లి, నానక్‌నగర్ గ్రామాల మధ్య రోడ్డు పక్కన ఈ భూమిలో మినీ స్టేడియం ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని మండల పరిధిలోని క్రీడాకారులు అంటున్నారు. విశాలంగా ఉన్న ఈ స్థలంలోనే ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా పోలీసు ఉద్యోగాలు సాధించేందుకు యువకులు రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్‌లలో శిక్షణ పొందుతున్నారు. కాగా, ప్రతీ ఏడాది సంక్రాంతి, దసరా పండుగల సందర్భంగా క్రికెట్ పోటీలు ఏర్పాటు చేస్తుంటారు. ఈ భూమిని మినీ స్టేడియం కోసం కేటాయించాలని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దారులకు గతంలో వినతి పత్రాలందించినా ఎవరూ పట్టించుకోవడం లేదని క్రీడాకారులు తెలిపారు. ఈ విషయంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కల్పించుకొని మినీ స్టేడియం ఏర్పాటుకు స్థలం కేటాయించడానికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



మహేశ్వరం : ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వాణి

మహేశ్వరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతలో వ్యాపారులు, హోటళ్ల యజమానులు, ప్రజలు సామాజిక బాధ్యతతో భాగస్వామ్యం తీసుకోవడంతో పాటు ఎప్పటికప్పుడు అధికారులకు సహకరించాలని తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వాణి అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం మున్సిపల్ పరిధిలో పలు వార్డుల్లో తడిచెత్త, పొడిచెత్తపై అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్లపై చెత్త వేసిన పలువురుని గుర్తించి జరిమానా విధించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించాలి

కొత్తూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని మున్సిపల్ కమిషనర్ బాలాజీ సూచించారు. 100 తడి, పొడి చెత్తను వేరుచేయుట, సీజనల్ వ్యాధులపై కొత్తూర్‌లో మున్సిపల్ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు జె.సుదర్శన్‌గౌడ్, వ్యాపారవేత్త బాబులాల్‌చౌదరి, వార్డు అధికారులు, మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పారదర్శకంగా ఉండాలి

కడ్తాల్/చౌదరిగూడ, జూన్ 13(ఆంధ్రజ్యోతి):ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో రాజకీయాలకు తావివ్వకుండ పారదర్శకంగా చేపట్టాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కంబాల పరమేశ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహరెడ్డిలు కోరారు. కడ్తాల మండలం చరికొండలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు పర్యటించారు. గుడిసెల్లో నివాసముంటున్న పేదల వద్దకు వెళ్లి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు గూర్చి అడిగి తెలుసుకున్నారు. పీఏసీఎస్ డైరెక్టర్ జోగు వీరయ్య, నాయకులున్నారు. అలాగే పేద ప్రజల అభ్యున్నతే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ సయ్యద్ సాధిక్ అన్నారు. కొందుర్గు మండలం శ్రీరంగాపూర్‌లో ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు.



కడ్తాల్ : గుడిసెలను పరిశీలిస్తున్న కంబాల పరమేశ్, గంప వెంకటేశ్, జీఎల్ఎస్ రెడ్డి

3,750 ఎకరాలు

ఈ ఏడాది జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం

(మూడో పేజీ తరువాయి)



దృష్టిలో పెట్టుకుని వీటి సాగుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. పంట సాగు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందచేస్తున్నాయి. ఇందులో భాగంగా కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయిస్తున్నాయి. అలాగే పంట కోసిన అనంతరం రైతులకు గిట్టుబాటు ధర స్థానికంగానే కల్పించేందుకు ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. పామాయిల్ ఉత్పత్తి కర్మాగారాలను స్థానికంగానే ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అయిదు కంపెనీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. పామాయిల్ గింజలను కంపెనీలు నేరుగా రైతుల నుంచి సేకరించి స్థానికంగానే వీటి నుంచి నూనెను ఉత్పత్తి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది.

ముందు వచ్చిన వారికి ప్రాధాన్యత

ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చే రైతులకు ప్రోత్సాహకాలు ఇస్తున్న ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపిక కోసం దరఖాస్తులు ఆహ్వానించింది. ముందు దరఖాస్తు చేసుకున్న వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని జిల్లా ఉద్యానశాఖాధికారి సురేష్ తెలిపారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించే లక్ష్యంతో ఈ సంవత్సరం దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. జిల్లాలో ఈ ఏడాది 3750 ఎకరాల్లో పంట సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ.. ఎంత మంది రైతులు ముందుకు వచ్చినా వారందరికీ మొక్కలు అందిస్తామని తెలిపారు. అయితే డ్రిప్ పరికరాల సబ్సిడీ మాత్రం 3750 ఎకరాలకు మాత్రమే అందజేస్తామన్నారు. ఆసక్తిగల రైతు సోదరులు తమ దగ్గరలో ఉన్న ఉద్యాన అధికారిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

భారీగా ప్రోత్సాహకాలు

ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం భారీగా ప్రోత్సాహకాలు అందచేస్తోంది. రైతులకు మొక్కలను సబ్సిడీపై అందచేస్తుంది. ఎకరానికి 57 మొక్కలు అవసరం కాగా, వీటన్నింటినీ రాయితీతో సరఫరా చేస్తుంది. వాస్తవానికి ఒక్కో మొక్క ఖరీదు రూ.200 వరకు ఉండగా వీటిని రూ.20 చొప్పున అధికారులు అందిస్తున్నారు. అలాగే ఆయిల్ పామ్ తోట కోసం సబ్సిడీపై డ్రిప్ పరికరాలను అందజేస్తున్నారు. డ్రిప్ పరికరాలకు ఎస్సీ, ఎస్టీలకు 100శాతం సబ్సిడీ ఇస్తుండగా, వెనుకబడిన తరగతుల వారికి 90శాతం, ఇతర రైతులకు 80శాతం సబ్సిడీతో పరికరాలు అందిస్తున్నారు. గరిష్ఠంగా 12.5 ఎకరాలకు డ్రిప్ సబ్సిడీ ఇస్తున్నారు. అలాగే ఆయిల్ పామ్ తోట సాగు చేస్తున్న రైతులు అంతర పంటలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందచేస్తోంది. మొక్కలు నాటిన అయిదేళ్లకు నుంచి పంట చేతికి వస్తుంది. ప్రతి ఏటా ఎకరానికి రూ. లక్షన్నర వరకు ఆదాయం వస్తుందని అంచనా. అయితే నాలుగేళ్ల పాటు రైతుకు ఆదాయం ఉండదు కనుక ఈ కాలంలో ఆయిల్ పామ్ తోటలో అంతర పంటసాగు కోసం ప్రభుత్వం సహాయం అందిస్తోంది. ఒక్కో ఎకరానికి ప్రతీయేటా రూ.4,200 చొప్పున నాలుగేళ్ల పాటు సాయం అందించనున్నారు. సాగు మొదలైన ఏడాది నుంచి సాయాన్ని రైతు ఖాతాలో నేరుగా జమ చేస్తారు.

చిన్నారుల సంక్షేమానికి ప్రాధాన్యం

- ఐసీడీఎస్ సీడీపీవో శాంతిశ్రీ
- పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసం
- పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ



కొత్తూర్ : అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈవో అంగోర్‌నాయక్, కౌన్సిలర్లు

కందుకూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): చిన్నారులు, బాలింతలు, గర్భిణుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో శాంతిశ్రీ అన్నారు. శుక్రవారం మండలంలోని గూడూరు, బండమీదగూడూరు. గ్రామాల్లోని అంగన్వాడి కేంద్రాల్లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. సూపర్వైజర్ సబిత, ఎంఈవో నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం : ప్రభుత్వ నిబంధనల ప్రకారం టీచర్లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి కస్నానాయక్ అన్నారు. తుమ్మలూరు పాఠశాలలో నిర్వహించిన అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్నారు.

శంషాబాద్ రూరల్ : ముచ్చింతల్‌లోని జూపల్లి బాలమ్మ మెమోరియల్ పాఠశాలలో విద్యార్థులతో అక్షరభ్యాసం చేయించారు. ఎంఈవో లక్ష్మణ్ ఆధ్వర్యంలో పాఠశాలలో నూతనంగా అడ్మిషన్‌లు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు అక్షరాలు దిద్దించారు. జీహెచ్ఎం ఉమామహేశ్వరి, హెచ్ఎం సుశీల, ఖుషీ ఎన్జీవో తెలంగాణ కో ఆర్డినేటర్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శంషాబాద్ రూరల్ : చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

మాడ్గుల : చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతిరేఖ కోరారు. అప్పారెడ్డిపల్లి, మాడ్గుల అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం సందర్శించారు.

కడ్తాల్ : కడ్తాల్ బాలుర ప్రాథమికోన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా సామూహిక అక్షరభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో సత్యనారాయణ, యూటీఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్, యూటీఎఫ్ మండలాధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్, ఉపాధ్యక్షుడు మల్లయ్య ఉన్నారు.

కొత్తూర్ : పరిధిలోని గ్రామాల్లో విద్యార్థులు లేక మూతపడ్డ పాఠశాలలను ఎంఈవో అంగోర్‌నాయక్ శుక్రవారం ప్రారంభించారు. ఎల్ఆర్కేతండా, స్టేషన్‌తిమ్మాపూర్, అక్కవానిగూడ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు రాకపోవడంతో మూతపడ్డాయి. స్పందించిన ఎంఈవో బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి విద్యార్థుల తలిదండ్రులను చైతన్యపరిచారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు కోస్గి శ్రీనివాస్, చంద్రకళరాజేందర్‌గౌడ్, నాయకుడు రాజేందర్‌గౌడ్, గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

చౌదరిగూడ : బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జిల్లేడ్ చౌదరిగూడ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు అన్నారు. రావిర్యాల పాఠశాలలో సామూహిక అక్ష్యరాబాస కార్యక్రమాన్ని హెచ్ఎం మంజుభార్గవి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను అందజేశారు. కొందుర్గు మండలం ఉత్తరాస్‌పల్లి అంగన్వాడీ కేంద్రంలో అక్ష్యరాభ్యాసం చేపట్టారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోత్స్న, శివకుమార్, కృష్ణయ్య, తల్లిదండ్రులున్నారు.

కేశంపేట : ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉండడంతో నాణ్యమైన విద్యా అందుతుందని కేశంపేట మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం, యూనిఫాం, నోట్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ చిన్నారులతో పాటు, ప్రభుత్వ పాఠశాలలో చేరిన విద్యార్థులకు మాజీ జడ్పీటీసీ, ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య, ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ అక్షరాభ్యాసం చేయించారు. క్లస్టర్ హెచ్ఎం విద్యావతి, హెచ్ఎం అప్పారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దివ్యాసింగ్ ఉన్నారు.

తలకొండపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వెల్జాల జడ్పీహెచ్ఎస్‌లో ఎంఈవో చంప్లానాయక్‌తో కలిసి పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీలు శ్రీనివాసమూర్తి, అంజాజీ, తదితరులున్నారు.

కడ్తాల్ : మండల పరిధిలోని వాసుదేవ్ పూర్ గ్రామంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్‌వీ నాయకుడు సుమన్‌నాయక్ పాల్గొని ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు పంపిణీ చేశారు.

ఇబ్రహీంపట్నం : మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి ఇబ్రహీంపట్నం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు లావణ్యతో కలిసి యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఆలూరి వెంకటేష్, టీచర్లున్నారు.

షాబాద్ : సర్కార్ బడిలో చదవులు మీ పిల్లల జీవితంలో వెలుగులు నింపుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి అన్నారు. చందన్‌వెల్లి స్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. తాగునీరు అందించేందుకు వాటర్ ఫిల్టర్ను గ్రామానికి చెందిన చిప్పలపల్లి గోపాల్ అందజేశారు.



కేశంపేట : యూనిఫాం అందిస్తున్న మాజీ జడ్పీటీసీ విశాల

క్రైం కార్నర్

వృద్ధురాలిపై లైంగికదాడి కేసులో..

దుండగుల కోసం గాలింపు ముమ్మరం

నాలుగు బృందాలుగా.. క్రైమ్ పార్టీ పోలీసుల వేట

యాచారం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): యాచారం పోలీస్‌స్టేషన్ పరిధి మంతన్‌గౌరెల్లిలో బుధవారం రాత్రి ఓ వృద్ధురాలి(90)పై లైంగికదాడికి పాల్పడ్డ నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. గురువారం ఉదయం ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో నాలుగు క్రైమ్ పార్టీ పోలీస్ బృందాలు జంటనగరాలతో పాటు నల్గొండ జిల్లాలోని పలు ప్రాంతాలకు తరలివెళ్లి గాలిస్తున్నట్లు సమాచారం. కాగా, పోలీసులు ఇప్పటికే గ్రామంలో పలువురిని ప్రశ్నించి వదలిపెట్టారు. గ్రామంలో గంజా యి గ్యాంగ్ ఉందని గ్రామస్థులు చెబుతున్నారే కానీ, ఫలానా వ్యక్తి తాగడం, అమ్మడంపై పోలీసులకు ఖచ్చితమైన సమాచారం ఇవ్వలేకపోతున్నారని పోలీసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే గ్రామంలో నాలుగైదు మద్యం విక్రయించే బెల్ట్ దుకాణాలున్నాయని, కొంతమంది యువకులు మద్యం పూటుగా సేవించి మైకంలో వృద్ధురాలిపై దారుణానికి ఒడిగట్టి ఉంటారని కొందరు గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిరోజులుగా దుండగులు బాధితురాలి ఇంటికి కొంత దూరంలో మద్యంతాగి అల్లరి చేసేవారని గ్రామస్థులు చెబుతున్నారు. నిందితుల జాడ చెబితే తమపై దాడులకు తెగబడతారనే భయంతో గ్రామస్థులు భయపడుతున్నారని సమాచారం. ఏసీపీ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ త్వరలో నిందితులను పట్టుకుంటామన్నారు. డాగ్‌స్క్వాడ్‌తో పాటు క్లూస్‌టీం ఇచ్చిన నివేదిక ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నామన్నారు. గంజాయి విషయంలో పోలీసులకు సమాచారమందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఇదిలా ఉండగా బాధితురాలి ఆరోగ్యంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని బంధువులు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం.. కేసు నమోదు



పురందేశ్వరి(ఫైల్)

ఆదిభట్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని అదృశ్యమైన ఘటన ఆదిభట్ల పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ మండలం, కుర్మల్‌గూడ, ఇంద్రానగర్ కాలనీకి చెందిన కొడవళ్లూరి దుర్గా పురందేశ్వరి(21), గురువారం ఉదయం మీర్‌పేట్‌లోని ప్రభుత్వం కాలేజీలో సర్టిఫికెట్స్ తీసుకొని వస్తానని ఇంటి నుంచి వెళ్లి రాత్రి వరకూ తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 87126 62383, 8712662094 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

తల్లిదండ్రులు మందలించారని కుమారుడు..



మాణిక్యం(ఫైల్)

చేవెళ్ల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారని కుమారుడు ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని చన్వల్లి గ్రామంలో చోటుచేసుకుంది. సీఐ భూపాల్ శ్రీధర్ కథనం మేరకు.. చన్వల్లికి చెందిన వీరనోళ్ల జంగయ్య, నీలమ్మల కుమారుడు మాణిక్యం(22) తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనులు చేస్తుంటాడు. అయితే, ఇంటి పని విషయంలో తల్లిదండ్రులు మాణిక్యంను మందలించారని, బైక్ రిపేర్ చేయించమని చెప్పినా తల్లిదండ్రులు పట్టించుకోలేదనే కోపంలో ఈనెల 6న బయటకు వెళ్లివస్తానని చెప్పి ఇంటికి తిరిగి రాలేదు. దాంతో తల్లిదండ్రులు, గ్రామంలో, చుట్టుపక్కల గ్రామాల్లో, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలుకింద పడి కార్మికుడి మృతి

కొత్తూర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో రైల్వేబ్రిడ్జి వద్ద రైలుకింద పడి రింకూసింగ్(22) అనే కార్మికుడు మృతిచెందాడని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన రింకూసింగ్ కొత్తూర్‌లో నివాసముంటూ ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడని తెలిపారు. శుక్రవారం విధులకు వెళ్లేందుకు రైలు పట్టాలు దాటుతుండగా, మహబూబ్‌నగర్ నుంచి కాచిగూడ వెళ్తున్న రైలు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ రింకూసింగ్‌ను స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. లోకో పైలెట్ చిరంజీవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి



కందుకూరు : కొత్తూరులో ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు

కందుకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై రైతులు అధికారులకు అర్జీలు పెట్టుకోవాలని, రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని కొత్తూరు, తిమ్మాపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయన కొత్తూరు గ్రామంలో నిర్వహించిన సదస్సులో పాల్గొని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్‌లతో కలిసి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు మండలంలో 18 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులను నిర్వహించగా 636 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ కె.గోపాల్ ఆర్డీవో దృష్టికి తెచ్చారు. మాజీ సర్పంచ్ కృష్ణాగౌడ్, సత్యనారాయణ. పాండురంగారెడ్డి, పాండు, జగన్, వెంకటేష్‌గౌడ్, పి.శేఖర్, ఎం.యాదగిరి, ఎస్ జగన్, తదితరులున్నారు.

ఆదిభట్ల : భూ భారతి చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, రెవెన్యూ సదస్సుల్లో రైతుల పాల్గొని సమస్యలను తెలుపాలని ఇబ్రహీంపట్నం ఎమ్మార్వో సునీతరెడ్డి తెలిపారు. ఆదిభట్ల మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 28 రకాల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కాగా, కాంగ్రెస్ నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్ అసైన్డ్, సీలింగ్, భూదాన్ భూములు కబ్జాకు గురవుతున్నాయని ఎమ్మార్వోకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అధికారులు నర్సింహ, విక్రమ్‌రెడ్డి, రాజేష్, కృష్ణ, రమేష్, రాజు పాల్గొన్నారు.

చేవెళ్ల : భూ సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు భూ భారతి చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని తహసీల్దార్ బి.కృష్ణయ్య తెలిపారు. మండలంలోని గొల్లపల్లి, ధర్మసాగర్‌లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్ర, సిబ్బంది, కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

తలకొండపల్లి : భూసమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహద పడుతాయని తహసీల్దార్ నాగార్జున అన్నారు. వెంకటాపూర్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మాజీ సర్పంచ్ రమేశ్‌యాదవ్, తదితరులున్నారు.

ఆమనగల్లు : మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో తహసీల్దార్ లలిత ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మాజీ సర్పంచ్ గోదాదేవి సత్యం, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి



మంచాల : చిత్తాపూర్‌లో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డా.పద్మజ

మంచాల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రసాయనాల వినియోగాన్ని తగ్గించాలని వ్యవసాయ శాస్త్రవేత్త డా.పద్మజ అన్నదాతలకు సూచించారు. చిత్తాపూర్‌లో శుక్రవారం రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్తలు డా.పద్మజ, డా.టి.రాంప్రకాష్‌లు రైతులకు సలహాలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో నిఖిత, రైతుసంఘం అధ్యక్షుడు జె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : భూ సార పరీక్షల ద్వారా అవసరమైన మేర ఎరువులు వాడడం ద్వారా సాగు ఖర్చును తగ్గించుకోవచ్చని శాస్త్రవేత్తలు డాక్టర్ వి.అనిత, డాక్టర్ పి.సుప్రజ, డాక్టర్ ఎం.సుజాత, విద్యాసాగర్, శిరీష, దీప్తిలు తెలిపారు. మక్తమాదారం, ఎక్వాయిపల్లి గ్రామాల్లో ఏవో శ్రీలత అధ్యక్షతన అవగాహన సదస్సులు నిర్వహించారు. ఏఈవోలు అభినవ్ రెడ్డి, శ్రీకాంత్, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు బాల్‌రాజ్, రైతులు పాల్గొన్నారు.

షాబాద్ : రసాయనాల వాడకాన్ని తగ్గించి, సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి పొందాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు పి. ఎతీష్, డి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తిర్మలాపూర్ గ్రామంలో అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, ఏఈవో వరుణ్‌కుమార్, గ్రామస్థులు మహేందర్‌రెడ్డి, బాలయ్య తదితరులున్నారు.

చేవెళ్ల : రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలని శాస్త్రవేత్తలు డాక్టర్ వి.రమ్య, డాక్టర్ కవితాకిరణ్, డాక్టర్ ప్రమీల తెలిపారు. పామెన గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పండ్ల తోటలతోపాటు, ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు దృష్టి పెట్టాలని సూచించారు. ఏవో శంకర్‌లాల్, ఏఈవోలు బాలకోటేశ్వర్, తదితరులు ఉన్నారు.



చేవెళ్ల : పామెన గ్రామంలో కరపత్రాలు విడుదల చేస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

మంత్రి శ్రీహరికి శుభాకాంక్షల వెల్లువ



ఆమనగల్లు : శుభాకాంక్షలు తెలుపుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ గీతా నర్సింహ



షాద్‌నగర్ అర్బన్ : శ్రీహరికి శుభాకాంక్షలు చెబుతున్న మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

ఆమనగల్లు/షాబాద్/షాద్‌నగర్ అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడలు, యువజన శాఖల మంత్రి వాకిటి శ్రీహరిని శుక్రవారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీతనర్సింహ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి సత్కరించారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టినందుకు అభినందనలు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి, కొత్తగా పశువుల ఆసుపత్రుల ఏర్పాటుకు, మినీ స్టేడియాల నిర్మాణానికి, యువతకు ఉపాధి కల్పనకు పెద్దపీట వేయాలని శ్రీహరిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు గీత తెలిపారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబోద్దీన్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, తదితరులున్నారు. అలాగే షాబాద్ మంత్రివ శ్రీహరిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ ఏఎంసీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్, నాయకులు రాజుగౌడ్ తదితరులు శాలువాతో సన్మానించారు. అదేవిధంగా మంత్రి శ్రీహరికి మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించి, అభినందనలు తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మహేష్

'రాజీవ్ యువ వికాసం' పేరుతో యువతను మోసం చేస్తున్న కాంగ్రెస్

కేశంపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పేరుతో యువతను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కుంచుకోట మహేష్ ఆరోపించారు. కేశంపేట మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. నిరుదోగ్య యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్పి, రాజీవ్ యువ వికాసంలో కాంగ్రెస్ ప్రభుత్వం దరఖాస్తులు తీసుకుందని తెలిపారు. జూన్ 2 తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు మొదటి విడత సాయం అందిస్తామని చెప్పిన ప్రభుత్వం యువతకు మొండి చేయి చూపిందని ఎద్దేవ చేశారు. ప్రభుత్వం చేతనైన హామీలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. యువతకు ఉపాధిపై ఆశాలు రేకిత్తించి వారిని ఇబ్బందులు పెట్టడం సరికాదని తెలిపారు. అర్హులైన యువతకు వెంటనే రాజీవ్ యువ వికాసంలో లబ్ధి చేకుర్చాలని డిమాండ్ చేశారు. నరేందర్‌రెడ్డి, తిరుపతి, పర్వతాలు, వీరేందర్ నాయక్ పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

కేశంపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతుల రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని కేశంపేట మండల వ్యసాయాధికారి శిరీష శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. రైతు భరోసా దరఖాస్తు ఫారంలో అన్ని వివరాలు నమోదు చేసి, పట్టాదారు పాసుబుక్, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ పత్రాలు జత చేయాలని సూచించారు. దరఖాస్తు పత్రాలను ఆయా గ్రామాల ఏఈవోలకు అందజేయాలని సూచించారు.

విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్‌ను కలిసిన నాయకులు

కేశంపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ మోహన్ మురళిని శుక్రవారం కేశంపేట బల్క్ మిల్క్ కలెక్షన్ యూనిట్ అధ్యక్షుడు పిల్లి అమరేశ్వర్ షాద్‌నగర్ పట్టణంలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేసి శాలువాతో సత్కరించారు. నాణ్యమైన పాలు సేకరించి డెయిరీ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

ఘనంగా చిత్తరంజన్ దాస్ జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న చిత్తరంజన్ దాస్

ఆమనగల్లు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనర్, శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్ దాస్ జన్మదిన వేడుకలు శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. ఆమనగల్లు శృతిలయ కల్చరల్ అకాడమీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాకారులు, సంఘ సేవకులు, సామాజిక వేత్తలు, అకాడమీ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సంఘ సేవకుడు పాపిశెట్టి రాముతో కలిసి చిత్తరంజన్‌దాస్ కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పట్టణంలో పలుచోట్ల మొక్కలు నాటారు. సేవా కార్యక్రమాలు నిర్వహించారు. చిత్తరంజన్ దాస్‌ను పలువురు సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విజయ్, అభినవ్‌రెడ్డి, కవిత, శ్రీను, శ్రీశైలం, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెడికల్ కిట్ల పంపిణీ

ఆమనగల్లు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): చింతలపల్లిలో శుక్రవారం గర్భిణులకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. శోభకుమార్, యాదయ్య, జంగయ్య, తదితరులున్నారు.